
ప్రజాశక్తి
శుక్రవారం 21 జులై 2023 8 పేజీలు



తిరుపతి



చిత్తూరు

# 'తొలకరి' పులకరింపేది..?

- ఖరీఫ్‌పై రైతుల గంపెడాశ
- తగ్గిన చెరుకు సాగు విస్తీర్ణం
- వాతావరణ ప్రభావంతో తెగుళ్లు



**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

తిరుపతి జిల్లా తూర్పు మండలాలను జూన్ మాసం లోనే తొలకరి వర్షాలు పలకరించినా, పులకరించే స్థాయిలో లేవనే చెప్పాలి. నెల రోజులుగా అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయే తప్పా భారీ వర్షాలకు ఆస్కారం లేకుండా పోయింది. దీంతో రైతులు బోరు మోటార్లు, బావులు, తెలుగు గంగ నీటిపై ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతేడాది వర్షాలు సమద్ధిగా పడ్డాయి. ఈ ఏడాది ముందుగానే తొలకరి పలకరించడంతో ఖరీఫ్ ఆశా జనకంగానే ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఆశించిన మేర వర్షాలు పడకపోవడంతో దిగాలు పడుతున్నారు. అంతేకాకుండా వాతావరణ పరిస్థితుల వల్ల పంటలకు చీడ పీడలు అధికం కావడంతో లబోదిబోమంటున్నారు.

**90 శాతం నాట్లు పూర్తి**

ఏటా ఈ రోజుల్లో అంతటా చక్కగా నాట్లు వేసుకుని మొదటి విడత ఎరువు వేసుకుంటూ దిగుబడులపై రైతు కలలు కనాల్సిన క్షణాలివి. అయితే ఈ ఏడాది పరిస్థితులు తల్లకిందులుగా ఉంటున్నాయి. గ్లోబల్ వార్మింగ్ దష్ట్యా ప్రతి ఏటా ఖరీఫ్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆ దష్ట్యా ఖరీఫ్ లో ఆశించిన మేర సాగుబడి జరగడం లేదు. 'తొలకరి వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురు చూడటం.. తీరా భంగపడి ఖరీఫ్ ఆశలు వదులు కోవడం పరిపాటిగా వస్తోంది. గత ఏడాది మాత్రం వర్షాలు ఆశించిన మేర పడ్డా ఈ ఏడాది ముఖం చాటేశాయి. వర్షాలను నమ్ముకుని రైతులు ఇప్పటికే 90 శాతం వరి నాట్లు వేసేశారు. శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ డివిజన్

2లో

# సీఎం సారూ.. స్పందించండి..!

**ప్రజాశక్తి-వెంకటగిరి**

వెంకటగిరి పట్టుచీరలకు ప్రసిద్ధి.. పట్టుచీర శుభకార్యాలకు కట్టుకుంటే ఎంత ఆర్భాటంగా ఉంటుందో, అవి నేసే నేతన్నల బతుకుల్లో మాత్రం శూన్యం ఆవహించింది. పట్టుచీరలు నేయడానికి ఉపయోగించే ముడిసరకుపై కేంద్రం జిఎస్‌టి వడ్డించడం, మరమగ్గాల ప్రభావం నేతన్నల బతుకులపై తీవ్ర ప్రభావం చూపింది. అంతేకాదు నియోజకవర్గం మెట్ట ప్రాంతం కావడంతో ఈ ప్రాంతానికి అవసరమైన పనులన్నీ నిలిచిపోవడంతో ఆర్థికాభివృద్ధి సాధించలేదనే చెప్పాలి.




వెంకటగిరి రైల్వేస్టేషన్

దశాబ్ధాకాలం క్రితం నడుకుడి-శ్రీకాళహస్తి రైల్వే పనులు ఫేస్-1 పూర్తి అయినా నేటికీ ఫేస్-2, ఫేస్-3 పనులు నత్తనడకన సాగుతున్నాయనే చెప్పాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ వాటాను కేటాయిస్తే ఈపనులు ముందుకు సాగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాను అందించడం లేదని తెలుస్తోంది. ఈ రైల్వే లైను పూర్తి అయితే ఈప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. హైదరాబాదుకు వెళ్లాలంటే దాదాపు 150కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. పేరుకు



సిఎం పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

2లో

ఉపాధ్యాయులు లేరని....

# పాఠశాలకు తాళం




2లో

# రేపు రాష్ట్ర గవర్నర్ రాక

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

ఈ నెల 22 న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయ 12 వ స్నాతకోత్సవం కులపతి హోదాలో పాల్గొననున్నారనికలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 న ఉదయం 9.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయ అతిథి గహం చేరుకుంటారు. ఉదయం 10.55 గంటలకు స్నాతకోత్సవంలో పాల్గొని మధ్యాహ్నం 2 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగుప్రయాణం కానున్నారని కలెక్టర్ ఆప్రకటనలో తెలిపారు.



## ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్/ సూళ్లూరుపేట**

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) పిలుపు మేరకు గూడూరు మున్సిపల్ కార్యాలయం ముందు సామూహిక రిలేనిరాహారదీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆప్కాస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు, క్లాప్‌డ్రైవర్లకు జీతాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం కాంట్రాక్టు కార్మికులు 33వేల మంది ఉన్నారని, ఔట్‌సోర్సింగ్ మూడు లక్షల మంది ఉన్నారని తెలిపారు. వీళ్లందరినీ పర్మినెంట్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం 10,117 మందిని మాత్రమే కాంట్రాక్టు వాళ్లను పర్మినెంట్ చేస్తానని చెప్పి లక్షలాది మంది కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికుల బతుకులను బుగ్గిపాలు చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిఎం స్పందించకుంటే 27న మున్సిపల్ కార్యాలయానికి తాళాలు వేస్తామని, ఆగస్టు 7న కలెక్టరేట్‌లను ముట్టడిస్తామని చెప్పారు. అప్పటికీ స్పందించని పక్షంలో ఆగస్టు 17న చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పెంచల నరసయ్య, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపీనాథ్, నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, సామంజి మణి, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు. సూళ్లూరుపేట మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో మహిళా కార్మికులు గురువారం దీక్ష నిర్వహించారు.

## ఉచిత మెగా ఇంపాక్ట్ కరపత్రం ఆవిష్కరణ

**తిరుపతి టౌన్ :** విద్యతోపాటు విద్యార్థి వికాసం జరగాలని కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి తెలిపారు గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఉచిత మెగా ఇంపాక్ట్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత విలువైనది, శక్తివంతమైనది విద్యని, విద్యతో పాటు విద్యార్థి వికాసం జరగాలన్నారు. జీవనోపాధి కల్పించేలా ఉండాలన్నారు. గంపా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గత 26 ఏళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని వారి నైపుణ్యాభివృద్ధి కోసం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మహతి ఆడిటోరియంలో ఉదయం 9 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జరిగే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు దాదాపు 30 మంది పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 7416666489, 7702431281, 9160091606, 9912233305 నందు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్స్ డాక్టర్ శ్రీధర్ విట్టలం, రత్నసేఖర్, తహసున్నీసా బేగం, నడ్డి నారాయణ, మునిలక్ష్మి తదితరులు పాల్గన్నారు.



# 'తొలకరి' పులకరింపేది..?

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలో(శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీపురం మండలాల్లో) సాధారణ సాగు విస్తీర్ణం 10,477 హెక్టార్లు. అందులో వరి 6785 హెక్టార్లకు గాను 6685 హెక్టార్లలో నాట్లు వేశారు. వేరుశెనగ 2 వేల హెక్టార్లలో, చెరుకు వెయ్యి హెక్టార్లకు గాను 440 హెక్టార్లు, సజ్జలు 1334 హెక్టార్లకు గాను 712 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభమై నెల గడిచిపోతున్నా తొలకరి పులకరింపులు లేకపోవడంతో రైతులు బోర్లు, బావులపైన ఆధారపడాల్సి వస్తోంది.

**తగ్గిన చెరుకు, వేరుశనగ సాగు**


తూర్పు మండలాల్లో చెరుకు, వేరు శెనగ సాగు నానాటికీ తగ్గుముఖం పడుతోంది. ఓ పక్క చక్కర కర్మాగారాలు మూతపడటం, మరో పక్క రైతుల డిమాండ్ మేరకు విత్తనాలు లభించకపోవడం ఇందుకు కారణంగా చెప్పుకుంటున్నారు. తూర్పు మండలాల రైతులు ట్యాగ్-24 రకం విత్తనాలను సాగు చేసేందుకు సుముఖత చూపుతుంటారు. అయితే రైతుల డిమాండ్‌కు తగ్గట్లుగా ప్రభుత్వం వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేయకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గి 2 వేల హెక్టార్లకే పరిమితమైంది. మయూరా చక్కెర కర్మాగారం మూతపడటం, పిచ్చాటూరు చక్కెర కర్మాగారంలో బకాయిలు పేరుకుపోవడంతో తూర్పు మండలాల్లో పూర్తిగా చెరుకు సాగుకు రైతులు విముఖత చూపుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు అరుతడి, ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లుతుండటం గమనార్హం.

**వాతావరణ ప్రభావంతో తెగుళ్లు**

తొలకరి వర్షాలు ఆశించిన రీతిలో లేని కారణంగా వాతావరణం లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అటు ఎండ రాక, ఇటు వర్షాలు కురవక పంటలకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. ముఖ్యంగా వరి పంటలో నల్లి, మోము తెగులు తగిలి దెబ్బతింటున్నాయి. వర్షాలు సమద్ధిగా కురిస్తే తెగుళ్లు పోతాయనీ, కనీసం ఎండ బాగా వచ్చినా పిచికారి మందుల తోటి తెగుళ్లను నివారించుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఆ రెండు కాకుండా వాతావరణం మబ్బులు పట్టి ఉండడంతో పంటలకు చీడ పీడల బెడద ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు.

**ఎరువులు సిద్ధం: రమేష్ రెడ్డి, ఏడీఏ, శ్రీకాళహస్తి**

ఈ ఏడాది వర్షాలు ఆశించిన మేర కురిసే అవకాశాలు కనిపించడం లేదు. అయినా రైతులు 90 శాతం వరి నాట్లు వేసేశారు. రైతులకోసం 350 టన్నుల మేర ఎరువులను ఆర్బీకేల ద్వారా రైతులకు అందించాం. రైతుల డిమాండ్ మేరకు ఆర్బీకేల్లో ఎరువులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నాం. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో నల్లి, మోము తెగుళ్ల బెడద ఎక్కువైంది. నివారణా చర్యలు చేపడుతున్నాం.



**వర్షాలు పడితేనే: రైతు, మహానాధ రెడ్డి, చిందేపల్లి**

కష్టమో, నష్టమో ఏటా రెండు పంటలు పండిస్తున్నాం. అయినా ఆశించిన దిగుబడులు, గిట్టుబాటు ధర రావడం లేదు. విత్తనాలు, ఎరువుల ధరలు ఏటా పెరిగిపోతున్నాయ్. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు. అయినా ముందుకే సాగుతున్నాం. ధరలకు తోడు పకతి కూడా కన్నెర్ర జేస్తుండడంతో మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. వర్షాలు పడితేనే ఈ సారి పంట.

# సీఎం సారూ.. స్పందించండి..!

(మొదటి పేజీ తరువాయి)



నడుకుడి-శ్రీకాళహస్తి రైల్వే లైనుగా పేరు పెట్టినా ఈలైను పూర్తి అయిన తరువాత వెంకటగిరి రైల్వే జంక్షన్‌గా మారుతుంది. అలాగే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సోమశిల-స్వర్ణముఖి లింకు కెనాల్ పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకు పనులు సాగు..తూనే ఉన్నాయి. ఫారేస్టు క్లియరెన్స్ లేక ఈకెనాల్ పనులు సాగడం లేదని సంబంధింత శాఖాధికారులు తెలుపుతున్నారు. కెనాల్ పనులు పూర్తి అయితే రైతులు మూడు పంటలు పండించుకునే అవకాశం కలుగుతుంది. అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా నెలకొంది. ఈకెనాల్ పూర్తి అయితే ఆయా గ్రామాలకు సాగు, తాగు నీళ్లు అందించవచ్చు. ఈపనుల పై దృష్టిసారించాల్సిన అధికార యంత్రాంగం ఆదిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఈప్రాంత ప్రజల కల కలగానే మిగిలిపోయిందనే చెప్పాలి. డక్కిలి మండలంలో ఆల్తూరుపాడు రిజర్వాయరు భూసేకరణ చేసి పనులు కూడా ప్రారంభించారు. వైఎస్ఆర్ ప్రభుత్వం రాగానే స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, ఇరిగేషన్ మంత్రి అనిల్‌కుమార్ మధ్య విభేదాల కారణంగా ఈప్రాజెక్టు పనులను అటకెక్కించారు.

అంతేకాదు పాదయాత్రల సందర్భంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల కోసం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లు నిరీక్షిస్తూనే ఉన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో క్రమబద్ధీకరిస్తామని చెప్పిన హామీ నాలుగేళ్లు పూర్తయినా నిర్లక్ష్యంగానే ఉన్నారన్న బాధ వారిలో గూడుకట్టుకుపోయి ఉంది. మున్సిపల్ కార్మికులు, విఆర్ఎలు, స్కీంవర్కర్లు ఆందోళనలు చేస్తుంటే పోలీసులతో నిర్బంధం ప్రయోగిస్తూ అణచివేస్తున్నారే తప్ప, హామీలను అమలు చేయడం లేదని వారు మండిపడుతున్నారు.

## సీఎం సభను విజయవంతం చేయండి

**ప్రజాశక్తి-వెంకటగిరి :** సిఎం సభకు సర్వం సిద్ధం చేశారు. గురువారం ట్రయిల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. తిరుపతి రోడ్డులోని హ్యాండ్‌లూమ్ టెక్నాలజి సమీపంలో ఈసభను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామానికీ రాత్రి బస్సును పంపే విధంగా ఏర్పాటు చేశారు. సిఎం హెలిప్యాడ్ విశ్వోదయ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. నేరుగా బహిరంగ సభ ప్రాంతానికి రోడ్డుషో ద్వారా వెళతారని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ముఖ్యమంత్రి సభను కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని సూచించారు. నేతన్న నేస్తం కార్యక్రమానికి వస్తుండడంతో చేనేత కార్మికులందరూ సభకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

**కాన్వాయ్ రీహార్సల్స్ పూర్తి**

సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహణ పూర్తయ్యిందని తెలిపారు. రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సిఎం హెలికాప్టర్‌లో వెంకటగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని బహిరంగసభ ప్రాంగణానికి రోడ్డు మార్గాన చేరుకుంటారు. సివిల్, ఎఆర్ విభాగాల నుంచి దాదాపు 1500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పర్యవేక్షణలో అడిషనల్ ఎస్పిలు అడ్మిన్ వెంకటరావు, కులశేఖర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


ఉపాధ్యాయులు లేరని....

## పాఠశాలకు తాళం

**ప్రజాశక్తి - వి.కోట:** వి.కోట మండల పరిధిలోని ఎంఎం కుంట ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక పోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు పాఠశాలకు తాళం వేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు... యాలకల్లు పంచాయతీ ఎం ఎం కుంట లో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో దాదాపు 20 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల ప్రారంభమైనప్పటినుండి అరాకొర ఉపాధ్యాయులతో నడుస్తున్న పాఠశాల ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరతతో మూసి వేసే పరిస్థితి నెలకొంది. దీన్ని అధిగమించేందుకు మండల విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రాథమికోన్నత పాఠశాల నుండి ఒక ఉపాధ్యాయునికి ఈ పాఠశాల అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు లేక తమ పిల్లల భవిష్యత్తు ఏ విధంగా తయారు అవుతుందోనన్న ఆందోళనలతో గ్రామస్తులు గురువారం తమ పాఠశాలకు ఉపాధ్యాయులని కేటాయించే వరకూ పాఠశాలను తెరిచేది లేదని గేటుకు తాళం వేసి ఆందోళనకు దిగారు. ప్రభుత్వం నగరి నుండి ఎం.ఎం.కుంటకు ఉపాధ్యాయులను బదిలీ చేయగా వారు బాధ్యతలు స్వీకరించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ యువరాజ్ మండల విద్యాశాఖ అధికారులతో చర్చించి గ్రామస్తులకు సర్దిచెప్పి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం పాఠశాల తెరుచుకుంది.




## శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



**ప్రజాశక్తి-వరదయ్యపాలెం:** తమ స్టడీ టూర్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 10 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ పుట్టుక, ప్రస్థానం, ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమాల గురించి వివరించడంతో పాటు, శ్రీసిటీ ఏర్పాటుతో నాడు వెనుకబడ్డ ఈ ప్రాంతం నేడు ఆర్థికంగా ఎలా అభివద్ధి సాధించిందో వివరించారు. ఏపీ దర్శన్ లో భాగంగా శ్రీసిటీకి విచ్చేసిన ఐఏఎస్ శిక్షణ అధికారులు ఈ ప్రాజెక్టు గురించి పలు సందేహాలను సవివరంగా అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలను వీక్షించడంతో పాటు బ్లూస్టార్ ఏసీ తయారీ పరిశ్రమను సందర్శించారు.

## 'ఇంద్రధనస్సు'పై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** ఐఎంఐ ఇన్సెంటివ్ మిషన్ ఇంద్రధనస్సు ప్రోగ్రాం ఈనెల 19 నుండి 24వ తేదీ వరకు గృహసందర్శనలు చేసి వ్యాధి నిరోధక టీకాలు తీసుకోని పిల్లలు, గర్భవతులుంటే వారిని గుర్తించాలని మండల వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ అన్నారు. గురువారం వైద్యసిబ్బందికి ఆశా వర్కర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేపట్టాలని ఆదేశించారు.

**బైరెడ్డిపల్లి:** స్థానిక పిహెచ్‌సిలో మండల పరిధిలోని ఆశా వర్కర్లకు ఇంద్రధనస్సు కార్యక్రమంలో గురువారం డాక్టర్ శాలిని ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శాలిని మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు కచ్చితంగా వేయించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి టిడి, కుష్టు, సీజనల్ వ్యాధుల నివారణ గురించి అవగాహన కల్పించారు. సిహెచ్‌ఓ అనురాధ, సూపర్‌వైజర్లు గోపి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## దేవదొడ్డిలో కబడ్డీ పోటీలు

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండల పరిధిలోని దేవదొడ్డి గ్రామంలో ఈనెల 22వ తేదీన శివకుమార్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలో గెలుపొంది వారికి మొదటి బహుమతి రూ.15,116లు, రెండో బహుమతి రూ.10,116లు, మూడో బహుమతి రూ.7,116లు, నాలుగో బహుమతి రూ.5,116లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని, ఎంట్రీ రుసుం లేదని వారు తెలిపారు.

## శ్మశానవాటికకు దారి కల్పించండి..!

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలోని గంగినాయనిపల్లి పంచాయతీపరిధిలో ఉన్న గంగినాయన పల్లి గ్రామ ఎస్సీ కాలనీవాసులు శ్మశాన వాటికకు దారి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహశీల్దార్ కార్యాలయంలో ఆరు నెలల క్రితం జరిగిన ఎస్సీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అయితే ఇంతవరకు ఆ విషయమై రెవెన్యూ సిబ్బంది వారు పట్టించుకున్న పాపానపోలేదు. బుధవారం ఎస్సీ కాలనీలోని సుబ్బక్క మరణించడంతో గ్రామం నుండి శ్మశాన వాటికకు అతికష్టంపైన తీసుకెళ్లాల్సి వచ్చిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన వాటికకు దారి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈవోలు

**ప్రజాశక్తి- పలమనేరు:** పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుబ్రమణ్యం గురువారం పరిశీలించారు. అందులో భాగంగా ఆ పాఠశాలలో కోడిగుడ్లు, చిక్కీలు క్వాలిటీ, వెయిట్ తనిఖీ నిర్వహించారు. ప్రతి పాఠశాలల్లో ఎగ్స్, చిక్కీలను తనిఖీ చేసి తీసుకోవాలని సూచించారు. చిక్కీలు 90 రోజులు కాలపరిమితి మాత్రమే ఉంటుందని కాలపరిమితి చూసుకొని తీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సెమిస్టర్-2 పుస్తకాలు మండల కేంద్రం నుంచి పౌరసరఫరాలు శాఖ నిర్వహిస్తున్న ఎండియు వాహనాల ద్వారా సరఫరా చేశారు.

# ఓటర్ల జాబితా తయారీలో సహకరించాలి

### డిప్యూటీ కలెక్టర్ భవాని



**ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు:** ప్రతి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా తయారీకి వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని డిప్యూటీ కలెక్టర్ భవానీ పిలుపునిచ్చారు. గంగాధర నెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని టిడిపి, వైసిపి, బిజెపికి చెందిన నాయకులు, అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21 నుండి ఆగస్టు నెల 21వ తేదీ వరకు ఓటర్ల వెరిఫికేషన్‌పై ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకే ఇంటి డోర్ నెంబర్లు ఒకే పేరుతో ఎక్కువగా ఓటుహక్కు ఉన్నట్లు ఇటీవల రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో పత్రికల్లో వస్తున్నాయని ఒకే డోర్ నెంబర్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉంటే అలాంటి వారిని క్షుణ్ణంగా పరిశీలించాలని, గ్రామంలో ఏఇంటిలోనైనా ఓటరుగా ఉన్నవారు చనిపోయిన వారిని, గ్రామం వదిలి ఇతర ప్రాంతాల్లోకి వెళ్లి స్థిరపడిపోయిన వారిని గుర్తించి ఆ ఓటర్లను సైతం తొలగించాలన్నారు. 18 ఏళ్ల నిండిన వారు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఇన్బనాధన్, ఎన్నికల డీటీ విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 150 రోజులు పూర్తి చేసుకున్న 'అన్నా క్యాంటీన్'



**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్న క్యాంటిన్ గురువారంతో 150వ రోజుకు చేరుకుంది. పేదల ప్రజల ఆకలి తీర్చేందుకు మాజీమంత్రి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జనవరి నెలాఖరు నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతూ వస్తోంది. ఈ కార్యక్రమానికి పలువురు దాతలు సైతం ముందుకొచ్చి తమ వంతు సాయాన్ని అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన అన్న క్యాంటిన్‌ను వైసిపి ప్రభుత్వం మూసివేసినా, పేదప్రజల ఆకలి తీరుస్తున్న మాజీ మంత్రి అమర్ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా అన్న క్యాంటిన్ నిర్వహణకు ముందుకొచ్చిన దాతలను టిడిపి నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ రెడ్డి, ఆర్‌బిసి కుట్టీ, నాగరాజు, మురళీ, అమరనాథ్‌రెడ్డి, సురేష్, శ్రీనివాసులు, లోకేష్, బాబాజాన్, వాసు, ప్రమీల ,పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బి+ గ్రేడ్




**ప్రజాశక్తి- కార్వేటినగరం:** కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 12, 13 తేదీన న్యాక్ బందం కళాశాలను సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించి అధ్యాపకుల బోధనలను, విధివిధానాలను, కళాశాలలో కల్పించబడిన మౌలిక వసతులను, క్రీడావిభాగం, లైబ్రరీవిభాగం, కళాశాలలోని ప్రయోగశాలలను, సమన్వయపరిచిన ఐక్యూ ఏసీ విభాగంను డిజిటల్ తరగతులను పరిశీలించి పూర్తి సంతప్తి వ్యక్తం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులు రెడ్డి తెలిపారు. అలాగే కమ్యూనిటీ కౌన్సిలింగ్ సెంటర్ కళాశాల విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలును హర్షం వ్యక్తం చేశారు. నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కమిటీ బందం మన కళాశాలకు 3.0 సిజిపిఏతో మదింపు చేసి బి++ గ్రేడ్ ను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ గుర్తింపు 5 సంవత్సరాలు వ్యాలిటి కలిగే ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ విజయులు రెడ్డి డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి, ఒరిజినల్ జాయింట్ డైరెక్టర్ కడప డాక్టర్ బాబుకి, టిటిడి డిఇఓ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ లలితాబాలాజీ, సర్పంచ్ ధనంజయ వర్మ లకు కతజ్ఞతలు తెలిపారు.

## భూతగాదాల్లో వ్యక్తి మృతి..!



**ప్రజాశక్తి-రామకుప్పం:** మండలంలోని ముద్దనపల్లి పంచాయతీ, ఆవుల కుప్పం గ్రామాల శివారులలో భూతగాదాల్లో ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గురువారం బాధితులు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆవులకుప్పం గ్రామానికి చెందిన రవి (48) అతను భార్య యశోదమ్మ ఇద్దరూ తమ పొలం పనులు చేసుకునేందుకు ఉదయం 7:30గంటలకు వెళ్లారు. మణేంద్రం పంచాయతీ మొద్దులవంక గ్రామానికి చెందిన జగన్నాథ్ అను అతను రవి సాగుచేస్తున్న పొలంలోకి ట్రాక్టర్ తీసుకొచ్చాడు. తన పొలంలోలోకి ప్రవేశించకూడదని చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. జగన్నాథ్ మీ అంత చూస్తానంటూ వెళ్లిపోయాడు. కొంతసేపటికి జగన్నాథ్, అతని భార్య కౌశల్య, కుమారుడు ప్రవీణ్, తమ్ముళ్ల మంజు, ప్రశాంత్, మంజు భార్య సాలమ్మ, చెల్లెలు ప్రమీల కలిసి వచ్చి తన భర్తను కాళ్లతో తన్ని, రాళ్లతో కొట్టి, పిడి గుద్దులు గుద్ది గడ్డపారతో తలపై బలంగా కొట్టడంతో విపరీతంగా రక్తస్రావమై అక్కడ మృతి చెందాడని యశోదమ్మ విలపించింది. మృతి చెందిన రవి కల్లుగీత కార్మికుడు, అతని భార్య కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రవి కుటుంబీకులు, గ్రామస్తులు కలిసి జగన్నాథ్ కుటుంబీకులు నివాసం ఉంటున్న ఇళ్లపై పెట్రోల్ పోసి నిప్పంటించి తగలబెట్టారు. జగన్నాథ్ కుటుంబీకుల వల్ల ప్రాణహాని ఉందని తమకు రక్షణ కల్పించాలని పోలీసులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని కుప్పం సిఐ శ్రీధర్, వీకోట సిఐ ఆశీర్వాదం, ఎస్ఐ కష్ణయ్య , స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టిప్పర్

### వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి- వికోట:** పేర్నంబట్ - వీకోట ప్రధాన రహదారిలోని దుర్గానగర్ సమీపంలో రోడ్డుపై గురువారం టిప్పర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మీద వివరాలు ఇలా ఉన్నాయి. బోయ చిన్నాగానపల్లికి చెందిన నవీన్ మేస్త్రి పనులు చేసుకుని జీవించేవాడు. వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో వికోటకు వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు దుర్గానగర్ సమీపంలో టిప్పర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర రక్తగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు వీకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భూ సర్వేకు సహకారం అందించాలి

**బుచ్చినాయుడుకండ్రిగ-ప్రజాశక్తి:** కనమనంబేడు గ్రామ రెవెన్యూలో చేపట్టిన భూ సర్వేకు సహకరించాలని వీఆర్వో ప్రసాద్ తెలిపారు. గురువారం కనమనంబేడు గ్రామంలో భూ సర్వేను ప్రారం భించారు. గ్రామంలోని పంట పొలాలను, భూ సర్వే నంబర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష.. పేదలకు రక్ష

**ప్రజాశక్తి-కేవీబీపురం:** జగనన్న సురక్షతో పేదలకు మంచి జరుగుతుందని.. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం కాట్రపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మీ నందకుమార్, వైస్ ఎంపీపీ డేరాల శ్రీనివాసులు, జడ్పీటీసీ మూర్తి మునెమ్మ, సర్పంచి సురేంద్ర, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాము, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ హరి తదితరులు పాల్గొన్నారు.

**గంగాధరనెల్లూరు:** సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం వలన పేద ప్రజలకు ఎంతగానో తోడ్పాటు లభిస్తుందని సర్పంచ్ బాబు, ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు తెలిపారు. గురువారం మండలంలోని తూగుండ్రం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్, ఎంపీటీసీల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ నేతలు చిట్టిబాబు మొదలి, ప్రభాకర్ రెడ్డి, జాన్ సుందరం, ఇఫ్తుకర్ అలి, డీలర్ శేఖర్ మొదలి, పంచాయతీ కార్యదర్శులు కుమార్, మురళి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

**బుచ్చినాయుడు కండ్రిగ:** వెస్ట్ వరత్తూరు గ్రామంలో సర్పంచ్ సుప్రియ, మండల కన్వీనర్ ఆరని విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడారు. ఎంపీపీ సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ మునెమ్మ, ఎంపీడీవో డీవీ నరసింహారావు, తహశీల్దారు భార్గవి, ఎస్సై మంజునాథరెడ్డి, సర్పంచ్ సుప్రియ, జేసీఎస్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, రమణయ్య, నిరంజన్‌రెడ్డి, ఇమామ్‌బాషా, ఎంఎల్‌వె ప్రసాద్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గూడూరు టౌన్ :** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజలందరూ తమ ఆశీర్వాదాలు అందించాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కోరారు. గురువారం గూడూరు పట్టణంలోని నలజాలమ్మ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయకులు, వైసీపీ సి.ఈ.సి సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి



బొమ్మిడి శ్రీనివాసులు, వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయ కుమార్, మురళి గోపి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

**పెళ్లకూరు:** పూనబాక సచివాలయ పరిధిలోని పూనబాక గ్రామంలో వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు అట్ల కృష్ణయ్య, వైసీపీ పార్టీ సీనియర్ నాయకుడు లింగమ నాయుడు, ఎంపీటీసీ కుమార్ స్వామి ఆధ్వరంలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం జరిగింది. ఎంపీపీ పొలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా, మండల కన్వీనర్ రఘునాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గూడూరు టౌన్:** నెర్నూరు సచివాలయం పరిధిలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి హాజరయ్యారు. జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, వైసీపీ సీనియర్ నాయకులు ఊటుకూరు మహేంద్రరెడ్డి, బత్తల రాజేష్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

**సత్యవేడు:** నిరుపేదల ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్రంలో పెద్ద ఎత్తున అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగింపునకు మళ్లీ అధికారంలోకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రావాలని ఉందని తిరుపతి జిల్లా సత్యవేడు జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. గురువారం మండల పరిధిలోని పెద్దఈటిపాకం, సత్యవేడు నాల్గవ సచివాలయం ప్రాంగణంలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## వరిలో సమగ్ర సస్యరక్షణతో దిగుబడులు



**ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ:** వరిలో సమగ్ర సస్యరక్షణతో దిగుబడులు సాధ్యమని ఏవో భారతి సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ భాస్కరయ్య మాట్లాడుతూ వరిపంటలో కాంప్లెక్స్ ఎరువులు యూరియాతో, గుళికలు కలిపి వేయడం వంటి వథా ఖర్చులు చేయకండని సూచించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌రెడ్డి, వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు, రైతులు, కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ సహాయకురాలు రేవతి, ప్రకతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## హక్కుల కోసం విశ్రాంత ఉద్యోగుల పోరాటం




**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** యూనియన్ పోరాటాలు చేయడంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన పీఆర్సీ, మెడికల్ అలవెన్స్, లబ్ధి పొందుతామని విశ్రాంతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గురురాజారావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం పుత్తూరు శాఖ పెన్షనర్ల భవనంలో 75 సంవత్సరాలు పూర్తయిన విశ్రాంత ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం పుత్తూరు శాఖ అధ్యక్షులు భాస్కరరాజు అధ్యక్షత నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పొందడానికి ముఖ్య కారకులైన ఏ.ఎస్.నకారా, జస్టిస్ చంద్రచూడ్‌ల కషిని కొనియాడారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్, జిల్లా సహాధ్యక్షులు కేవీ యుగంధర్‌రాజు, పుత్తూరు మండల శాఖ గౌరవాధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కపావరమ్మ, రామచంద్ర రాజు, అరుణాచల్‌రెడ్డి, మండల కార్యదర్శి కుప్పయ్య, వీసీఎస్ వర్మ , రామ్మూర్తిరాజు, నారాయణరెడ్డి, కోటక్ మహేంద్ర సంస్థ టీం లీడర్ శ్రీనాథ్ రెడ్డి, విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్ష



**ప్రజాశక్తి-నాయుడుపేట:** నాయుడుపేటలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళా పారిశుద్ధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయుడుపేట గౌరవ అధ్యక్షులు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని.. నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాడు హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా హామీలను నెరవేర్చకుండా తుంగలోకి తొక్కారని విమర్శించారు. 98 శాతం హామీల అమలు పరిచామని పదేపదే చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. మున్సిపల్ కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని.. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల్ని రెగ్యులర్ చేయకపోతే ఆగస్టు 15 నుండి నిరవధిక సమ్మెకు వెళతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శివకవి ముకుందా, పారిశుద్ధ్య కార్మికులు చెంగయ్య, మహా లక్ష్మమ్మ, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విద్యాభివృద్ధికి వెంకమరాజు కృషి

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** విద్యార్థులు విద్యాభివృద్ధికి వెంకమరాజు కషి చేశారని ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య పేర్కొన్నారు. వడమాలపేట మండలం పత్తి పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల విజయపురం మండలం శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆంగ్ల ఉపాధ్యాయులుగా బదిలీ అయిన దొమ్మరాజు వెంకమరాజును పత్తి పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ తరపున ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఆయన్ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివద్ధికి.. విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఆయన కృషిని కొనియాడారు. ఉపాధ్యాయులు శ్యామల,



శ్రీనివాసులు, విద్యా కమిటీ సభ్యులు, సర్పంచి తులసి, ఎంపీటీసీ సభ్యులు ప్రతిమ, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సుధా, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి



**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండు చేస్తూ గురువారం బుచ్చినాయుడుకండ్రిగ వద్దనున్న మయూర షుగర్స్ ఎదుట రైతులు, నాయకులు నిరసన తెలిపారు. ఆల్ ఇండియా చెరకు రైతుల సంఘం పిలుపుమేరకు మయూర ఫ్యాక్టరీ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత మాట్లాడుతూ జిల్లాలో ఆరు షుగర్ ఫ్యాక్టరీలుండగా.. నేడు కేవలం ఒక్క ఫ్యాక్టరీ మాత్రమే నడుస్తోందని.. చెరకు టన్నుకు రూ.5 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, జై చంద్ర, మునుస్వామినాయుడు, చంద్రబాబునాయుడు, మునికష్ణయ్య, వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమణయ్య, మండల అధ్యక్షుడు తిరుపాలయ్య, గురవయ్య పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డికి ఘనస్వాగతం



**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** నాలుగో రోజు పర్యటనలో భాగంగా కుప్పంకు వెళుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గురువారం పలమనేరు– కుప్పం జాతీయ రహదారిలోని బైరెడ్డిపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి సమీపాన ఆయనకు స్వాగతం పలికారు. వారి వెంట వైసిపి యువనాయకులు శైలేష్ చక్రవర్తిరెడ్డి, వీనష్, సర్పంచులు కొమ్ము వెంకటేష్ వైస్–సర్పంచ్ తబ్రోజ్, బేలుపల్లి సర్పంచ్ విసి.వెంకటేష్, ఎంపిటిసి భాస్కర్ మొదలి ఉన్నారు.

## బొజ్జల కుటుంబాన్ని ఆశీర్వదించండి




**ప్రజాశక్తి-రేణిగుంట:** గత 30 ఏళ్లుగా నిస్వార్థంగా ప్రజా సేవలో తరిస్తున్న బొజ్జల కుటుంబాన్ని ఆశీర్వదించాలని టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. గురువారం రేణిగుంట మండలంలోని మామండూరు గ్రామంలో 'మీ ఆశీర్వాదం కోసం ఇంటింటికి మీ బొజ్జల' కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. మామండూరు గ్రామంలో గడపగడపకు బొజ్జల సుధీర్ రెడ్డి, బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితమ్మ, టిడిపి నాయకులు వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రావిళ్ల మునిరాజనాయుడు, టిడిపి మహిళా నాయకురాలు చక్రాల ఉష, టిడిపి మండలాధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, రేణిగుంట క్లస్టర్ ఇన్‌ఛార్జి పుష్పనాథన్, టిడిపి సీనియర్ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, చిన్నారెడ్డి, భాస్కర్ యాదవ్, కొరియర్ రవి, మాజీ ఎంపీటీసీ గజేంద్రరెడ్డి, శంకర్ రెడ్డి, గురురాజు పల్లి భాస్కర్ రెడ్డి, అన్నసామిపల్లి భాస్కర్ రెడ్డి, శంకర్ రెడ్డి, మురళి, కుమార్, మునయ్య, బుజ్జి నాయుడు, మునస్వామి నాయుడు, నెల్లూరు సుబ్రహ్మణ్యం, నాద ముని రెడ్డి, సుబ్బరాయులు ఆచారి, హనీఫ్, ఎర్రమరెడ్డి పాలెం మోహన్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు బొజ్జల సుధీర్ రెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదువే ఆయుధం




**ప్రజాశక్తి -రేణిగుంట :** విద్య శక్తివంతమైన ఆయుధమని ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్దాల రవిబాబు స్పష్టం చేశారు. గురువారం రేణిగుంట మండలం ఎల్ఎన్ కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పుస్తకాలు, పలకలు, బలపాలు ఇతర విద్యా సామాగ్రి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్దాల రవిబాబు మాట్లాడుతూ తన మిత్రుడు అవినాష్ లండన్‌లో ఉంటున్నారని ఆకాంక్ష స్వచ్ఛంద సేవసంస్థ చేసే ప్రతి కార్యక్రమాన్ని చూసి ఆకర్షితులై రూ.5 వేలు పంపి తన కుమారుడు చిరంజీవి హేమకేష్ పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు విద్యాసామగ్రి అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మునికృష్ణ మనోజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసమస్యలను కలెక్టర్‌కు తెలియజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగరాజు

## ప్రజాసమస్యలపై దృష్టి సారించండి

**కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు వినతి**

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** జిల్లాలో ఉన్న వివిధ రకాల ప్రజాసమస్యలపై దష్టి సారించాలని గురువారం కలెక్టరేట్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు కలెక్టర్‌కి విన్నవించడం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ దష్టికి పలు సమస్యలు తీసుకువస్తూ ఐసిడిఎస్‌లో రోజురోజుకి సమస్యలు పెరుగుతున్నాయని వాటి పరిష్కారం కోసం సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని, భూ సమస్యలు ఉన్న మండలాల్లో వాటి పరిష్కారం చేసే దిశగా చూడాలని, కలెక్టర్ ఇచ్చిన జిఓ ప్రకారం వేతనాలు ఇవ్వని పరిశ్రమలు, సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, పాడి రైతులను దోచుకుంటున్న డెయిరీలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా కాపాడాలని లాంటి 20రకాల సమస్యలను కలెక్టర్ దష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ సోమవారం ఈ సమస్యలపై చర్చించి పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రమాద బీమా ఎంతో ప్రయోజనం

**సప్తగిరి గ్రామీణ బ్యాంకు జిఎం రవిశంకర్**

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** ప్రతిఒక్కరూ బీమా చేసుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని సప్తగిరి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ రవిశంకర్ అన్నారు. గ్రామీణ బ్యాంకు నగరసింరాయునిపేట బ్రాంచ్ పరిధిలో పాలూరు గ్రామానికి చెందిన ఖాతాదారుడు ఆర్ముగం విద్యుత్ ఘాతానికి గురై మరణించారు. బ్యాంకు ద్వారా యూనివర్సల్ సోంపు జెనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుండి నమోదు చేసుకున్న పర్సనల్ యాక్సిడెంట్ బీమా మొత్తం ఐదు లక్షల రూపాయలను చెక్కు ద్వారా కుటుంబానికి అందించారు. బ్యాంకు జనరల్ మేనేజర్ బికె రవిశంకర్, సిబ్బంది వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు.




బీమా సొమ్మును బాధిత కుటుంబ సభ్యులను అందజేస్తున్న జనరల్ మేనేజర్ రవిశంకర్

## వరికి పొటాష్ ఎరువులు తప్పక వాడాలి : ఏడిఎ

**ప్రజాశక్తి -తొట్టంబేడు:** వరి పంట చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు పొటాష్ ఎరువు తప్పక వాడాలని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ భాస్కరయ్య తెలిపారు. తొట్టంబేడు మండలం, కొత్త కండ్రిగ గ్రామంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. పొటాష్ వాడకం వలన పైరులో చీడల సమస్య తగ్గుతుందన్నారు. ధాన్యంలో తాలు గింజలు లేకుండా నాణ్యంగా ఉండి అధిక బరువు తూగుతుందని వివరించారు. చిరుపొట్ట దశలో ఎకరాకు 40కిలోల యూరియాతో పాటు 20కిలోల పొటాష్ ఎరువు వేసుకోవాలనిసూచించారు. నేడు పొటాష్ ఎరువు ధర పెరిగి పోవడంతో (బస్తా రూ.1700)మార్కెట్‌లో చౌకగా లభించే నాన్యతలేని ఎరువులను వాడొద్దని అన్నారు. శ్రీకాళహస్తి డివిజన్ ఎడిఎ రమేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులందరు ఈక్రాప్‌బుకింగ్ చేసుకోవాలన్నారు. ఆర్బీకేలలో రైతులకు అందజేస్తున్న పచ్చిరొట్ట ఎరువులు, రసాయన ఎరువులను వినియోగించుకోవాలనారు. వ్యవసాయ అధికారి వేణుగోపాల్ రావు, వ్యవసాయ అధికారి సురేంద్ర రెడ్డి, ఉద్యాన సహాయకురాలు అహంతి పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ



రాజకీయ పార్టీల ప్రతనిధుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** ఎన్నికల సజావు నిర్వహణలో ఓటరు జాబితా ప్రధాన భూమిక పోషిస్తుందని, జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే నివృత్తి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా సవరణపై డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు నమోదు, మార్పులకు సంబంధించి దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా మాత్రమే స్వీకరించడం జరుగుతున్నదని, ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఓటరు జాబితాలో పేర్లు చేర్పు, తొలగింపు జాబితాను ప్రతి శనివారం సచివాలయ పరిధిలో ఉంచడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు ఇందులో ఏదైనా సందేహాలు ఉన్నట్లయితే తరువాతి మంగళవారం నియోజకవర్గ స్థాయిలో లేదా బుధవారం జిల్లాస్థాయిలో జరిగే రాజకీయ పార్టీ సమావేశంలో తెలుపవచ్చునని అన్నారు.

ఓటరు జాబితా సవరణలో భాగంగా జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలోని 1,737 పోలింగ్ స్టేషన్‌లకు బిఎల్‌ఓలను నియమించి వారి జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందన్నారు. దీనికి అనుగుణంగా రాజకీయ పార్టీలు తమ బిఎల్ఏలను నియమించి జాబితాను తమకు అందజేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు నమోదు లేదా తొలగింపు సందర్భంగా నిర్దేశించిన ఫారంలపై బిఎల్ఓలు ధవీకరణ సంతకం చేస్తారని, రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఏలు లేదా దరఖాస్తుదారుని ఇంటి పక్కన ఉన్నవారు లేదా మరణించిన వారి బంధువులు ఇలా ఎవరైనా ముగ్గురు సాక్షులుగా సంతకం చేస్తే మరింత పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించవచ్చునని ఆయన కోరారు. మండల స్థాయిలో తహశీల్దార్లు, ఎంపిడిఓలు రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓను ఆదేశించారు. ఎపిక్ కార్డులకు ఆధార్ లింక్ ప్రక్రియ జిల్లాలో 91.87 శాతం పూర్తి అయ్యిందని, వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జిల్లాలో 20 జులై 2023 నాటికి 7,66,708 మంది పురుషులు, 7,79,874 మంది స్త్రీలు, 109 మంది హిజ్రాలు మొత్తం 15,46,691 మంది ఓటర్లుగా నమోదు కావడం జరిగిందని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, పేరు మార్పు చేర్పులకు సంబంధించి 4,348 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, దీనికి సంబంధించి చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, ఎస్ఆర్ పార్టీ ప్రతినిధి ఉదయ్ కుమార్, బిజెపి జిల్లా జనరల్ సెక్రెటరీ చిట్టిబాబు, టిడిపి జిల్లా సెక్రెటరీ సురేంద్ర కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్‌సెక్రటరీ పరదేశి, జిల్లా బిఎస్‌పి ఇంచార్జ్ కుమారస్వామి, ఎలెక్షన్ సెక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆర్డీవో రేణుక అన్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్‌స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. డివిజన్‌స్థాయి అట్రాసిటీ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ అంటరానితనం, మూఢనమ్మకాలు, అట్రాసిటీలపై చర్చకు కమిటీ సమావేశం ఒక మంచి వేదిక అని అన్నారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తిచేసి నిర్ణీత గడువులోపు ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ తదితరశాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఆయన తెలిపారు. బాధితులకు ప్రభుత్వం తరపున అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందేవిధంగా చూడాలన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్టు, తద్వారా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని తెలిపారు. ఏవో రామాంజులు నాయక్, తహశీల్దార్లు, పోలీసులు, పలు శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కేసు బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీవో రేణుక

# రణధీరపురం పంచాయతీ అభివృద్ధికి రూ.7.33 కోట్లు

**చెవిరెడ్డి లక్ష్మి ఆత్మీయ పలకరింపునకు విశేష స్పందన**

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)** తిరుపతి రూరల్ మండల పరిధిలోని మంగళం రణధీరపురం గ్రామపంచాయతీ అభివృద్ధికి చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి 7.33 కోట్ల రూపాయల నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేశారని ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి స్పష్టం చేశారు. గడపగడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా గురువారం రణధీరపురం గ్రామపంచాయతీలో చెవిరెడ్డి లక్ష్మి పర్యటించారు. ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పాటు, ప్రజల ఆరోగ్యమే పరమావధిగా పని చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా బిటిఆర్ కాలనీలో సీసీ డ్రైన్లు, సిసి రోడ్లు పెద్ద ఎత్తున నిర్మాణం చేయడం జరిగిందన్నారు. పంచాయతీ ఇన్ చార్జి పీఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రణధీరపురం గ్రామపంచాయతీ అభివృద్ధికి అడిగిందే తడవుగా ఎమ్మెల్యేగాని, మండల అధ్యక్షులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నిధులు మంజూరు చేయడంతోనే ఇంతటి అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఇంతటి అభివృద్ధికి కారకులైన చంద్రగిరి నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకోవడానికి రణధీరపురం గ్రామపంచాయతీ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మండల వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, సర్పంచు పి లీలావతి, మంగళం డివిజన్ వైసిపి అధ్యక్షులు ప్రళయకావేరి నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, సప్తగిరి కాలనీ, తిరుమల నగర్, మంగళం పంచాయతీల ఇన్చార్జులు వసంత అశోక్ కుమార్ రెడ్డి, గుండ్రాజు శివశంకర్ రాజు, చిలమంద హరికృష్ణ, రణధీరపురం ఉపసర్పంచ్ మల్లెమొగ్గలు ఉమాపతి, వార్డు మెంబర్లు మురళి, సతీష్, నాయకులు తుంటి సుధాయాదవ్, బత్తల గోపి, దయాకర్ పాల్గొన్నారు.



చెవిరెడ్డి లక్ష్మికి ఆహ్వానం పలుకుతున్న మహిళలు

**ప్రత్యామ్నాయం లేకుండానే చెంబేడు కాల్వ తవ్వకాలు**

# వరి రైతులు లబోదిబో



**ప్రజాశక్తి -తొట్టంబేడు:** పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనుల పేరుతో ప్రత్యామ్నాయం లేకుండానే చెంబేడు కాలువ తవ్వేయడంతో తమ పంటలు నష్ట పోవాల్సి వస్తోందని వరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెగా కంపెనీ నిర్వాకంతో తాము ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులు చేస్తున్న మెగా కంపెనీ వారు తొట్టంబేడు మండలం పొయ్య సమీపంలో గల అండర్ బ్రిడ్జి వద్ద చెంబేడు కాలువ డివైడెడ్ డ్యామ్‌ను ఉపకాలువ ఏర్పాటు చేయకుండానే తవ్వేశారు. ఈ కాలువ లింగమనాయుడు పల్లె, నెలబల్లి వైపు వెళుతుంది. ఉప కాలువ ఏర్పాటు చేయకుండా చెంబేడ కాలువ డివైడెడ్ డ్యామ్ తవ్వేయడం వలన కొమ్మనగుంట,పొయ్య, గురుకులపాళెం, కొణతనేరి గ్రామాలకు చెందిన రైతుల వరి పొలాలు నీటి మునిగి పోతున్నాయి. కోత దశలో వరి పంట నీట మునిగి పోతుండటంతో తాము పూర్తిగా నష్ట పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెగా కంపెనీ వారు ఇకనైనా స్పందించి పొయ్య అండర్ బ్రిడ్జి వద్ద నుంచి ప్రత్యామ్నాయంగా ఉప కాలువ ఏర్పాటు చేసి చెంబేడు కాలువ నీటిని విడుదలచేయాలని రైతులు కోరుతున్నారు. అధికారులు స్పందించి ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్**

## నూతన కమిటీ ఎన్నిక


**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈఎన్నికలలో జిల్లా అధ్యక్షుడిగా హేమంత్ రెడ్డి, కార్యదర్శిగా బైరెడ్డిపల్లికి చెందిన కిషోర్ శ్రీనివాసన్ సహా ఏడు మందితో కూడిన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికనట్లు ఉత్తర్వులు జారీచేశారు. నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఫుట్‌బాల్ క్రీడని దేశంలోనే నెంబర్ వన్‌స్థానానికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తామన్నారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా చిత్తూరు ధరనీష్, సంయుక్త కార్యదర్శిగా పులిచెర్ల ముని కుమార్, ట్రెజరీగా కుప్పం పవన్ కళ్యాణ్, సభ్యులుగా వినోద్, రవి ఎన్నికయ్యారు.

## కుమ్మరుల కడుపు కొట్టొద్దు : తులసిదాస్



**తిరుపతి(మంగళం):** అనాదిగా కుమ్మర సామాజిక వర్గానికి చెందిన వారు కులవత్తి అయిన మట్టి బొమ్మల తయారీ చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటే, ఇప్పుడు కుమ్మర వత్తికి అత్యవసరమైన మట్టిని తీసుకోనివ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదని తిరుపతి పార్లమెంటు టిడిపి శాలివాహన సాధికార సమితి అధ్యక్షులు ఆముదాల తులసీదాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మట్టి పాత్రల తయారీకి తిరుపతి రూరల్ మండలం దుర్గ సముద్రం గ్రామ సమీపంలోని చెరువులో మట్టిని సేకరించడానికి వెళ్లిన కుమ్మర సామాజిక వర్గానికి చెందినవారు మట్టి తీసుకువెళ్లడానికి అనుమతించకపోవడం చూస్తుంటే కుమ్మరుల హక్కులను కాలరాయడమే అన్నారు. దీనిపై క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లామని, అక్కడి గ్రామస్తులు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు జెసిబి లతో భారీ స్థాయిలో మట్టిని తీసుకెళ్లడాన్ని అడ్డుకున్నారని తెలిపారు. కుమ్మరుల కులవత్తిని కొనసాగించేందుకు అధికారులు సహకరించాలని కోరారు.

## యానాదులకు ఇళ్ల పట్టాలు పంపిణీ



**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** జగనన్న ప్రభుత్వంలో ప్రజలు అభివద్ధి చెందుతున్నారని పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు అన్నారు. గురువారం మండలంలోని పాలేరు సచివాలయంలోని పాలేరు పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వైబండపల్లిలో యానాదులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి వైస్ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్, మండల కోఆప్షన్ సభ్యులు ఫిరోజ్ అహ్మద్, సర్పంచులు ప్రసాద్‌రెడ్డి, వాణి ప్రియ, మాజీ సర్పంచ్ శరత్, కుమార్‌రెడ్డి, తహశీల్దార్ బెన్‌రాజ్, ఎంఈఓ నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

## అర్జున్ దాస్ అక్రమాలపై పూర్తి నివేదికను సమర్పిస్తాం



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** హథీరాంజీ మఠం మఠాధిపతిగా అర్జున్ దాస్ పలు అక్రమాలకు పాల్పడిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధార్మిక పరిషత్ కమిటీ గురువారం విచారణ చేపట్టింది. మఠం పరిపాలన వ్యవహారాల్లో వినియోగించే రికార్డులను నిశితంగా పరిశీలించారు. మఠం నగదు లావాదేవీలపై సిబ్బందిని ప్రశ్నించారు. కమిటీ విచారణకు మాజీ మఠాధిపతి అర్జున్ దాస్ గైర్హాజరుపై మీడియా కమిటీ సభ్యులను ప్రశ్నించగా స్పందించిన కమిటీ సభ్యులు కష్ణారెడ్డి విచారణకు అర్జున్ దాసు సహకరించి హాజరు కావాల్సి ఉందన్నారు. గైర్హాజరుపై తమ నివేదికలో తెలుపుతామన్నారు. మఠం ఉద్యోగులకు అందవలసిన జీతభత్యాలు, పెన్షనర్లకు పెన్షన్లు సకాలంలో అందేలా కమిటీ ద్వారా సిఫార్సు చేస్తామన్నారు. కాగా అర్జున్ దాస్ వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు వినతుల రూపంలో కమిటీకి తమ సమస్యలను చెప్పుకున్నారు.

# ప్రజా శ్రేయస్సు కోసం జగనన్న కృషి

**ప్రజాశక్తి- నగరి :** నిస్సహాయులకు అండగా జగనన్న సురక్ష కార్యక్రమం నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. ఇందుకు సహకరిస్తున్న అధికార యంత్రాంగాన్ని అభినందించారు. మున్సిపల్ పరిధి సత్రవాడ, కరకంతాపురం సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ఎవరైనా ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలిపోతే జగనన్న సురక్షలో భాగంగా గుర్తించి న్యాయం చేస్తామన్నారు. అనంతరం సచివాలయాల పరిధిలో 608 సర్టిఫికేట్లను లబ్దిదారులకు అందించారు. తమిళ, తెలుగు భాషల వారు సమపాళ్లలో ఉన్న సచివాలయం కావడంతో రెండు భాషల్లోను అనర్గళంగా ఆమె మాట్లాడటం ప్రత్యేకతను




సంతరించుకుంది. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్‌చైర్మన్ బాలన్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సీడీపీవో కష్ణవేణి, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ దయానిధి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచిపోయేలా తిరుపతి అభివృద్ధి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్ :** చరిత్రలో నిలిచిపోయేలా తిరుపతి అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. 17, 25 డివిజన్లలో దాదాపు 32 లక్షల 60వేల రూపాయల వ్యయంతో గురువారం కొత్త సిమెంట్ రోడ్లు,



కొత్త కాల్వలు, తాగునీటి బోరును ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, ఉప మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ ప్రారంభించారు. ఎంఎల్ఎ భూమన మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా తిరుపతి అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె బాబు, కార్పొరేటర్లు తాళ్లూరి రత్నకుమారి, కోటూరు ఆంజనేయులు, నరసింహాచారి పాల్గొన్నారు.

**ఛార్జీలు లేకుండా 'జగనన్న సురక్ష' సేవలు**

ప్రజలకు రక్షగా, జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎలాంటి సర్వీసు ఛార్జీ లేకుండా సేవలు అందిస్తున్నట్లు ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. 11 రకాల సేవలకు ఉచిత సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు తెలిపారు. గురువారం 16,36, 2 డివిజన్ల పరిధిలో సరోజినీదేవిరోడ్డు, ఆర్‌సి రోడ్డు, రేణిగుంట రోడ్డులో జగన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత పాల్గొన్నారు. అనంతరం లబ్దిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కుడితి సుబ్రమణ్యం, మోహన్, ఉమాఅజయ్, కోఆప్షన్ సభ్యులు ఖాదర్‌బాషా, అదనపు కమిషనర్ సునీత పాల్గొన్నారు.

# తాళపత్రాల స్కానింగ్‌పై ఎంఒయు చేసుకోవాలి

**ప్రజాశక్తి - క్యాంపస్:** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంతో ఎంఒయులు చేసుకుని వారి వద్ద ఉన్న తాళపత్రాలను డిజిటలైజ్ చేయాలని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి ఆదేశించారు . శ్రీ వేంకటేశ్వర మ్యాన్ స్క్రిప్ట్ ప్రాజెక్ట్ ప్రగతిపై ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో గురువారం ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ఇప్పటిదాకా డిజిటైజ్ చేసిన తాళపత్రాల్లో సమాజానికి ఉపయోగ పడే అంశాలున్న వాటిని పుస్తక రూపంలో తేవడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకోసం అవసరమైనంత మంది స్కాలర్స్ ను నియమించుకోవాలని సూచించారు. గత రెండు నెలలతో పోల్చితే ప్రాజెక్ట్ ప్రగతి బాగుందని అన్నారు. సనాతన జీవన ట్రస్ట్‌కు చెందిన శశిధర్‌ను సంప్రదించి ఆయన విరాళంగా అందిస్తానని చెప్పిన తాళపత్రాల స్కానర్‌ను త్వరగా తెప్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. తాళపత్రాల్లో మిస్ అయిన అక్షరాలను పొందుపరచగలిగే సాఫ్ట్ వేర్ ను



ఏర్పాటు చేసుకోవడానికి సంబంధిత వ్యక్తులతో చర్చించాలని ఈవో సూచించారు. ప్రస్తుతం ఉన్న తాళపత్ర బండిల్స్ లో మిగిలిన సుమారు వెయ్యి బండిల్స్ ను రాబోయే మూడు నెలల్లో స్కానింగ్ పూర్తి చేయాలని ఈవో చెప్పారు. జేఈవో సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణిసదాశివమూర్తి, మ్యాన్ స్క్రిప్ట్స్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యామ్ ఈ సమీక్షలో పాల్గొన్నారు.

# జావీద్ హబీబ్ ప్రారంభించిన ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి

**ప్రజాశక్తి తిరుపతి సిటీ:** స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్ లోని డి మార్ట్ పక్కన జావీద్ హబీబ్ హెయిర్ స్టైల్, బ్యూటిషన్ షోరూమ్ ను ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. నగర ప్రజలు యువత కోరిక మేరకు ఆధునిక టెక్నాలజీతో తయారు చేసిన హెయిర్ స్టైల్ బ్యూటిషన్ షో రూమ్ ను ప్రారంభించినట్లు ఆ షాపు



మేనేజింగ్ పార్ట్నర్స్ నరసింహారెడ్డి,రమణ తెలిపారు. మెరుగైన టీమ్ తో అతి తక్కువ ధరలతో పురుషులకు,మహిళలకు,యువతకు ప్రత్యేకంగా చిన్నారులకు కూడా హెయిర్ స్టైల్ బ్యూటిషన్ సిగ్నేచర్ ట్రీట్మెంట్ చేయడం జరుగుతుందన్నారు.వివాహాది శుభకార్యాలకు కూడా పెళ్ళికొడుకు,పెళ్ళి కుమార్తెలకు ప్రత్యేక ఫేస్ శుభ్రతలు చేస్తామన్నారు.ప్రత్యేక అనుభవం కలిగిన టీంతో అన్ని రకాల ఫేస్ హెయిర్ ట్రీట్మెంట్ చేస్తామని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్స్ భూమన అభినయ రెడ్డి, ముద్ర నారాయణ,గీత,ప్రియా నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక చైతన్యవంతులను చేయడమే లక్ష్యం



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** భారతదేశ ప్రజలను ఆర్థిక చైతన్యవంతులుగా చేయడమే లక్ష్యంగా బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు అందిస్తోందని రీజనల్ మేనేజర్ పి. అమర్నాథ్ రెడ్డి అన్నారు. గురువారం బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్యం పరిశుభ్రతపై తిరుపతి నగర ప్రజలకు అవగాహన కల్పిస్తూ బ్యాంక్ వాక్ థాన్ నిర్వహించారు. వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ తో కలిసి రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. నేడు భారతదేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడాను 1908 జూలై 20న సర్ సాయాజీరావు గైక్వాడ్ స్థాపించారన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా భారతదేశంలోని ప్రముఖ వాణిజ్య బ్యాంకులలో ఒకటిగా ఉండి 63.97 శాతం వాటాతో ఐదు ఖండాలలోని 17 దేశాలలో విస్తరించిందన్నారు. 70 వేల టచ్ పాయింట్ల ద్వారా 150 మిలియన్లకు పైగా ఉన్న తన గ్లోబల్ కస్టమర్ బేస్‌కు బ్యాంక్ సేవలు అందిస్తోందన్నారు. అత్యాధునిక డిజిటల్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా అన్ని బ్యాంకింగ్ ఉత్పత్తులు, సేవలను నిరంతరాయంగా అందిస్తోందన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా వరల్డ్ మొబైల్ యాప్ కస్టమర్‌లకు ఒకే యాప్ కింద పొదుపు, పెట్టుబడి, రుణాలు, షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న అన్ని పథకాలు బ్యాంక్ ఆఫ్ బరోడాలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ రీజినల్ మేనేజర్ బుర్రి ప్రసాద్, తిరుపతి నగర పరిధిలోని పలు బిఓబి బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు




**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులకు నిరసనగా పుత్తూరులో నగరి నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో కామాక్షి సమేత సదాశివేశ్వర ఆలయంలో గురువారం పూజలు చేపట్టారు. అనంతరం ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. తెలుగు మహిళా చిత్తూరు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు మగాళ్లు పెరిగిపోతున్నారని..వైసీపీ ప్రభుత్వంలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సంపూర్ణమ్మ, ప్రధాన కార్యదర్శి నాగరత్న, కౌన్సిలర్ రాధా అశోక్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రజిని, కార్యదర్శి గీత, మహిళలు పాల్గొన్నారు.

## బలిజ సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్ రాయల్

**ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ :** జీడి నెల్లూరు నియోజకవర్గ బలిజ సంఘం సీనియర్ నాయకుడు. నూతనంగా ఎన్నికైన కాపు సంక్షేమ సేన కమిటీ సంఘ అధ్యక్షులుగా ఎంపికయ్యి కే ప్రసాద్ రాయల్. మాజీ విఆర్ఓ. ఆహ్వానించి శాలువాలు కప్పి కండువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించడం జరిగినది. కాపు సంక్షేమ శాఖ సంఘం అధ్యక్షులుగా నూతనంగా పదవి బాధ్యతలను చేపట్టడం జరిగింది.

## ఘనంగా ధనంజయులునాయుడి జన్మదినం



**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్, చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి, వడమాలపేట మండల సీనియర్ ధనంజయ నాయుడు జన్మదిన సందర్భంగా చిత్తూరు పార్లమెంట్ టిఎన్‌టియుసి అధ్యక్షులు, రాష్ట్ర సహకార చక్కర కర్మాగారాల ఉద్యోగ, కార్మిక ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రావిళ్ల మాధవ నాయుడు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## గంగమ్మ సేవలో బియ్యపు పవిత్రారెడ్డి



**ప్రజాశక్తి-రేణిగుంట:** రేణిగుంట మండలంలోని కరకంబాడి శ్రీ గంగమ్మ తల్లి జాతరలో వైసీపీ మండల ఇన్‌ఛార్జి బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం కరకంబాడి గ్రామ దేవత గంగమ్మ తల్లి దర్శనానంతరం గ్రామ పెద్దలతో ముచ్చటించారు. గ్రామంలో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తక్షణం పరిష్కరిస్తామని పెద్దలకు హామీనిచ్చారు. కార్యక్రమంలో రేణిగుంట మండల ఎంపిపి కలపాటి హరిప్రసాద్ రెడ్డి, వైకాపా సీనియర్ నాయకులు జువ్వల దయాకర్ రెడ్డి, కరకంబాడి సర్పంచ్ ఈశ్వరమ్మ, కరకంబాడి వైకాపా నాయకులు సుబ్రమణ్యం,ఎంపిటిసి శ్రావణి, బి.డి బాబు, యోగేశ్వర్ రెడ్డి, పార్థసారథి, శివ కుమార్, బాబు రావ్, మహేష్, జయదేవ్, దిన దిలీప్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయ చైతన్య ర్యాలీ
## విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు:** ఈనెల 24న గూడూరులో జరగనున్న మాదిగల రాజకీయ చైతన్య ర్యాలీకి మాదిగలు తరలిరావాలని ఏపీ ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు తేనేపల్లి గురుశంకర ప్రసాద్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మార్పీఎస్ మండల నాయకులతో కలిసి ర్యాలీ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు ఏపీ ఎమ్మార్పీఎస్ నాగులయ్య, చిన్నపాప కే సుబ్రహ్మణ్యం, చంద్రమ్మ, శివ మాదిగ, కస్తూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వార్షికోత్సవం




**ప్రజాశక్తి- కార్వేటినగరం:** పుత్తూరు పట్టణంలోని బ్యాంక్‌ఆఫ్ బరోడా 116వ వార్షికోత్సవాన్ని గురువారం కార్వేటినగరం వద్దాశ్రమంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఎల్లప్ప మాట్లాడుతూ బ్యాంక్‌ఆఫ్ బరోడా బ్యాంకును ప్రారంభించి 116సంవత్సరాలు గడిచిందని, నిత్యం ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో సిబ్బంది అహర్నిశలు కషి చేస్తున్నారని తెలిపారు. సిబ్బంది అందించే సేవలతో 116 సంవత్సరాలను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నట్లు పేర్కొన్నారు. వృద్ధులకు తల దిండ్లు, ప్లేట్లు, గ్లాసులతో పాటు, స్వీట్లు పంపిణీ చేసి వృద్ధుల సమక్షంలో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ మేనేజర్ రాము, సిబ్బంది, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

# వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలి










**ప్రజాశక్తి-వరదయ్యపాలెం:** వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని సిఐటియూ మండల కార్యదర్శి బాషా ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని.. నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ వీఆర్ఏలుగా నియమించాలని.. అర్హులకు వీఆర్‌వోలుగా, అటెండర్, వాచ్‌మెన్ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు శ్రీహరి, రామమూర్తి, రాధయ్య, సుబ్రహ్మణ్యం, రామ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**చిత్తూరు అర్బన్:** విఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్స్ ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గురువారం చిత్తూరు, గంగాధర నెల్లూరు, కార్వేటినగరం, పెనుమూరు మండల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట విఆర్ఏలు రెండు రోజుల దీక్షలు చేపట్టారు. సిఐటియూ జిల్లా అధ్యక్షులు చైతన్య, విఆర్ఏ జిల్లా అధ్యక్షులు టి.కోదండన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతిపక్షనేతగా ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర లేదని ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా వేతనాలు పెంచలేదని విమర్శించారు. పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాలని, డిఏలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఆయా మండలాల విఆర్ఏ నాయకులు పెరుమాళ్, ఉదయ్ కుమార్, రేవతి, రాజా, రామచంద్ర, అరుణ, వినాయక, రాజేంద్ర పాల్గొన్నారు. 21వ తేదీ కూడా జిల్లాలోని అన్ని మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షలు చేయాలని వీరు కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 7,8 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆగస్టు 23,24 తేదీల్లో విజయవాడలో దీక్షలు 25వతేదీ విఆర్ఏలను ఛలో విజయవాడకు తరలిస్తామని హెచ్చరించారు.

**పలమనేరు:** రాష్ట్రంలోని వీఆర్ఏలకు పేస్కేల్ వర్తింపచేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్‌గుప్తా, వ్యవసాయ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్ రాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎదుట పలమనేరు వీఆర్ఏల సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్ఏలు ప్రకాష్, కిషోర్, మనోహర, సుబ్రహ్మణ్యం, కిరణ్, సుజాత, లావణ్య, అనిత, అరుణ పాల్గొన్నారు.

**రొంపిచెర్ల:** మండలం తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల వీఆర్ఏలు నిరాహార దీక్ష జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడు నజీర్ సాహెబ్, వీఆర్ఏలు లక్ష్మణ, నరేష్, దామోదర్, మల్లిక, విశ్వనాథ, రామచంద్ర, వాసుదేవ, ధనశేఖర్, వెంకటరమణ, శంకరమ్మ, శిరీష, రాజన్న, వెంకట నాగులు పాల్గొన్నారు.

**కార్వేటినగరం:** విఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని విఆర్ఏలు సమస్యల పరిష్కారం కోసం గురువారం మండల తహశీల్దార్ కార్యలయం ఎదుట దీక్షలు చేపట్టారు. దీక్షలో మునిరత్నం, బాలయ్య, సుబ్రహ్మణ్యం, ఝాన్సీ, వీఆర్ఏలు పాల్గొన్నారు.

**రామకుప్పం** :మండల రెవెన్యూ కార్యాలయం వద్ద వీఆర్ఏలు నిరసన తెలిపారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏల సంఘం అధ్యక్షులు కష్టప్ప, శివప్ప, రమణ, లలిత, ముక్తార్ భాష, చందన, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

**సత్యవేడు :** తహశీల్దార్ కార్యాలయం ఎదుట విఆర్ఏలు నిరసన దీక్ష చేపట్టారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎం.రమేష్ మద్దతు ప్రకటించి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకునిగా పాదయాత్ర చేస్తూ విఆర్ఏల సమస్యలు పరిష్కరించి, మీ మన్ననలు పొంది మీ ద్వారా పూలవర్షం కురిపించుకుంటానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్లయినా ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. డిఏలు కూడిన జీతాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి డి.అరుణాచలం, డి.చిరంజీవి, సుధాకర్, విజయం రాజయ్య, అనురాధ, అలిమేలు, సురేష్, రత్నం పాల్గొన్నారు.

## ప్రసాద్‌ను సన్మానించిన గోపిరాయల్

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** జిడి నెల్లూరు కాపు సంక్షేమ కమిటీ సంఘం అధ్యక్షులు కె.ప్రసాద్ రాయల్‌ను గురువారం పుత్తూరులో రాష్ట్ర కాపు సంక్షేమ సేన ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.గోపిరాయల్ ఎల్‌జి. రవికుమార్‌లు ఘనంగా శాలువాలు కప్పి సన్మానించారు.కార్యక్రమంలో ఎం.రవికుమార్, రఘురాయల్ పాల్గొన్నారు.

### విశ్వవిద్యాలయాల్లో
# పోస్టుల భర్తీలో రేషనలైజేషన్ ఆపాలి




**క్యాంపస్ :** విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను రెండు నెలల్లో భర్తీ చేయాలని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినందువలన దీనికి అనుగుణంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో, ఆర్జీయుకెటి వంటి ఉన్నత విద్యాసంస్థలలో ఉన్న దాదాపు 5వేల అధ్యాపక ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని బిఆర్‌ఎస్‌ఎం నేతలు తెలిపారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో అధ్యాపకుల పోస్టులలో కోత విధించే దానికోసం రాష్ట్ర ప్రభుత్వం రేషనలైజేషన్ చేపట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపు పొంది అనేక సంవత్సరాలుగా ఉన్నటువంటి విభాగాలను ప్రస్తుతం విద్యార్థులు లేరు అనే సాకుతో పోస్టులను తీసివేయటం రాబోయే రోజులలో విద్యార్థులకు తీరని నష్టం కలుగుతుందని తెలిపారు.

## ఐదు లీటర్ల సాటు సారా స్వాధీనం

**ప్రజాశక్తి- రొంపిచెర్ల:** ఎస్సై శ్రీనివాస్‌కు గురువారం సారాయి అక్రమ రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకొట్టిగల్లు గ్రామపంచాయతీ బలిజపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డికి చెందిన పొలం వద్ద ఉండగా అదే పల్లికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి ఒక సంచిలో 5 లీటర్ల సారా తీసుకురావడాన్ని గుర్తించి సారా స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చేశారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఏఎస్ఐ మధుసూదన్, కానిస్టేబుల్ వేణు పాల్గొన్నారు.

## సమస్యలపై వీసీకి వైఎస్ఆర్ విద్యార్థి సంఘం వినతి

**క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలోని విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలని ఆ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతిని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి.ఓబుల్‌రెడ్డి కోరారు. గురువారం వీసీ భారతిని మర్యాదపూర్వకంగా కలిసారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు, ఉద్యోగులకు అందాల్సిన అన్ని సంక్షేమ ఫలాలను అందించేందుకు వీసీ వారధిలా పని చేయాలని కోరారు. తద్వారా యూనివర్సిటీకి జా3తీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేతలు మణి, అవోక్‌రెడ్డి, ప్రదీప్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## చెరుకు రైతుల బకాయిలు చెల్లించండి



**పిచ్చాటూరు :** చెరకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులకు చెల్లించాలని, మూతబడిన చక్కెర పరిశ్రమలను తెరిపించాలని నేతమ్స్ సుగర్ ఫ్యాక్టరీ ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్దన్ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరు చక్కెర కర్మాగారాలు ఉండేవని, ఐదింటిని మూసేశారని తెలిపారు. ప్రస్తుతం మూతబడిన చక్కెర పరిశ్రమలను విక్రయిస్తూ చెరకు రైతులను నట్టేట ముంచుతున్నారని విమర్శించారు. నేతమ్స్ పరిధిలో 37 కోట్లు, మయూర పరిధిలో 20 కోట్ల బకాయిలు రైతులకు చెల్లించాల్సి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి, నారాయణవనం మండల కార్యదర్శి మునిశంకర్, నాగలాపురం మండల నాయకులు మురగేష్, మురగన్, కుమార్ పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం
### జిల్లా వైద్య అధికారి ప్రభావతి

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైద్యాధికారి ప్రభావతి అన్నారు. గురువారం మండలంలోని ముంగర మడుగు పంచాయతీలో గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్యఅధికారి ప్రభావతి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామంలోని నిరుపేద ప్రజలు కుటుంబవైద్యం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రార్థనా మందిరాన్ని తొలగించకండి

**ప్రజాశక్తి- నగరి:** క్వారీల పేరుతో ప్రార్థనా మందిరాన్ని తొలగించకండి అని క్రైస్తవ సోదరులు రోడ్డెక్కారు. నాగరాజకుప్పం మార్గంలో రోడ్డును ఆనుకొని ఉన్న కొండగుట్టను కొందరు క్వారీ లీజుపేరుతో తవ్వడానికి చూడటంతో ఆ కొండగుట్టపై తరతరాలుగా ప్రార్థనలు నిర్వహించే క్రైస్తవ సోదరులు గురువారం నాగరాజకుప్పం రోడ్డుపై బైటాయించిన వారు రాస్తారోకో చేశారు.

## గృహనిర్మాణాలు వేగవంతం చేయండి

### ప్రారంభించని ఇళ్ల పట్టాలు రద్దు ప్రక్రియ : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఈకార్యక్రమాల అమలులో జిల్లాను అగ్రగామిగా నిలపాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశమై క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పథకాల అమలు గురించి అభివద్ధి పనులు గురించి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గృహనిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని ఇంకా కొన్నిప్రాంతాలలో నిర్దేశిత లక్ష్యాలను చేరడం లేదని అందుకోసం తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. అదేవిధంగా గృహనిర్మాణానికి సంబంధించి కాలనీలలో ఇంకా ప్రారంభించని వారికి నోటీసులు ఇచ్చి తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు నిర్మాణాలను వేగవంతం చేయాలని అన్నారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ప్రస్తుతం జిల్లాలో మామిడి సీజన్ పూర్తి అయినందున పనులు కల్పించాలని ప్రతి మండలానికి సుమారు కోటి రూపాయల వరకు పనులు మంజూరు అయ్యాయని ఈ పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలని అన్నారు. దీని ద్వారా పనిదినాలను పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎస్ఈపిఆర్ చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డ్వామా గంగాభవాని, సిపిఓ ఉమాదేవి, డిడి సోషల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి, డిపిఓ లక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్, డెయిరీ డెవలప్మెంట్ అధికారి రవీంద్ర, డిసిఓ బ్రహ్మానంద రెడ్డి, డిఆర్డిఏ ఏపీడి రవి, డిపిఆర్‌సి షణ్ముగం పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి పెద్దపీట: మంత్రి పెద్దిరెడ్డి



**ప్రజాశక్తి- శాంతిపురం:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం శాంతిపురం మండలంలోని 121- పెద్దూరు, కెనమాకులపల్లిలో గ్రామసచివాలయ, ఆర్‌బికె భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి అని, ఎన్నికల ముందు ఇచ్చి హామీ ప్రకారం గత ఎన్నికల తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అక్కచెల్లెమ్మలు మహిళా సంఘాల ద్వారా పొందిన రుణాలు మొత్తం రూ.27వేల కోట్లను 4 దఫాలుగా తిరిగి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ కింద ఇస్తున్నామన్నారు. రైతు పంటకు గిట్టుబాటు ధర కొరకు రూ.3 వేల కోట్లు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాళ్ళబుదుగూరు పల్లెబాట కార్యక్రమంలో బాగంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు లాగా మా ప్రభుత్వం మోసం చేయదని, చెప్పిన ప్రకారం అన్ని హామీలను నెరవేర్చామని త్వరలోనే హంద్రీ- నీవా పనులను కూడా పూర్తిచేసి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వచ్చి ప్రారంభిస్తారని అన్నారు. రాళ్ళబుదుగూరులోని అతి పురాతన శ్రీ కొదండరామ దేవాలయానికి ప్రభుత్వము తరపున ఆర్థికసాయం చేస్తామన్నారు. ఈసారి వచ్చే ఎన్నికల్లో కుప్పం నుండి భరత్‌ను ఓట్లు వేసి గెలిపించాలన్నారు. తదనంతరం ప్రజల నుండి వినతులను స్వీకరించారు. రాళ్ళబుదుగూరు పంచాయతీకు జనాభా ప్రాతిపదికన ఇంకో సచివాలయాన్ని కేటాయించాలని కోరారు. మరోసభలో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందించడం జరుగుతున్నదన్నారు. దీనిని అనుసంధానంగా ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శాంతిపురం మండలం కెనమాకులపల్లి, 121పెద్దూరులో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80లక్షలతో ఆర్బి కెలను జెడ్పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంఎల్‌సిలు భరత్, సిపాయి సుబ్రహ్మణ్యం, పలమనేరు శాసనసభ్యులు వెంకటే గౌడ్, టిటిడి బోర్డు మెంబర్ పోకల అశోక్ కుమార్‌లతో కలసి మంత్రి ప్రారంభోత్సవం చేశారు. జెడ్పి సిఈఓ ప్రభాకర్ రెడ్డి, వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వనిత, పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ వెంకట్ రెడ్డియాదవ్, రెస్కో ఛైర్మన్ సెంథిల్ కుమార్, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు మొగసాల రెడ్డప్ప, కుప్పం మండల ఎంపీపీ కుమారి అశ్విని, ఏఎంసీ ఛైర్మన్ విద్యాసాగర్ శాంతిపురం మండల నేతలు జడ్పీటిసి ఎస్ శ్రీనివాసులు, ఎంపీపీ కే.వసుంధర కోదండ రెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రెస్కో మాజీ అధ్యక్షుడు జె చక్రపాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'షార్'లో అంతర్జాతీయ చంద్రుని దినోత్సవం

**ప్రజాశక్తి - సూళ్లూరుపేట:** గురువారం అంతర్జాతీయ చంద్రుని దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష పరిశోధనా కేంద్రాల్లో జరుపుకున్నారు. 1969, జులై 20 న నీల్‌ఆంస్ట్రాంగ్ మొదటి సారి చంద్రుని పై అడుగు పెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఈ రోజును అంతర్జాతీయ చంద్రుని దినోత్సవం గా జరుపుకోవడం ఆనవాయితీ. ఇస్రో ఈ నెల 14 వ తేదీ ప్రయోగించిన చంద్రయాన్ – 3 ప్రస్తుత భూమి చుట్టూ తిరిగే ప్రక్రియలో భాగంగా మూడు రౌండ్లు పూర్తి చేసుకొని ఈ రోజు ఉదయం భారత కాలమానం ప్రకారం ఉదయం 6 గంటల 45 నిమిషాలకు నాల్గవ రౌండు ను ప్రారంభించింది. చంద్రయాన్ 3 ముందుగా భూమి చుట్టూ ఐదు రౌండ్లు తిరిగిన తరువాత తన ప్రయాణాన్ని చంద్రుని వైపుకు మళ్ళిస్తుంది, భూమి చుట్టూ తిరిగే చివరి రౌండును ఈ నెల 25 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి 3 గంటల మధ్యలో మొదలు పెడుతుంది, ఆగస్టు 1 వ తేదికి చంద్రయాన్ –3 చంద్రుని కి దగ్గరగా చేరుకునే అవకాశం ఉంది.

